


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

నిజామాబాద్
కామారెడ్డి

ఆదివారం 29 డిసెంబర్ 2024 4 పేజీలు




## అన్ని వర్గాల వారు ఆధారిస్తున్న ఏకైక పత్రిక

# నేటి దిన పత్రిక "సూర్య"

### - సూర్య దిన పత్రిక క్యాలండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ఉమ్మడి రాష్ట్రంలో అన్ని వర్గాల వారు ఆధారిస్తున్న ఏకైక పత్రిక " నేటి దిన పత్రిక సూర్య" అని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కామారెడ్డి జిల్లా బ్యూరో గాండ్ల సుభాష్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, డిపిఆర్ఓ భీమ్ కుమార్ ల చేతుల మీదుగా "నేటి దిన పత్రిక సూర్య" క్యాలండర్ ను ఆవిష్కరించారు. అనంతరం కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ మాట్లాడుతూ., పత్రికలు నిజాన్ని నిర్భయంగా రాయాలని,(మిగతా 2లో)






## ఇందిరమ్మ ఇండ్ల సర్వే

# వేగవంతంగా నిర్వహించాలి

### - కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**సూర్య, కామారెడ్డి బ్యూరో**


ఇందిరమ్మ ఇండ్ల సర్వే పనులు వేగవంతంగా, నాణ్యతతో, పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పారిశుధ్యం, త్రాగు నీరు, ఇంటి పన్ను వసూళ్లు, సి.సి. చార్జీలు, ట్రాక్టర్ నెలవారీ వాయిదాల చెల్లింపులు, కంపోస్టు ఎరువుల తయారు, భవన నిర్మాణాల అనుమతులు, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, వనమహోత్సవం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, మహిళా శక్తి, అంశాలపై ఎంపిడిఒ లు, ఎంపీఒ లు, మిషన్ భగీరథ ఇంజనీర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నదని, జనవరి 3 లోగా సర్వే పూర్తిచేయాలని అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సర్వే తీరును పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో 2,38,682 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటివరకు 1,39,194 సర్వే జరిగిందని, 62 శాతం మేర సర్వే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలని తెలిపారు. మురికి కాల్వల్లో చెత్తతో నీరు రోడ్లపైకి రాకుండా శుభ్ర పరచాలని తెలిపారు. దోమల వ్యాప్తి నివారణకై పిచికారి చేయాలనీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో (మిగతా 2లో)

# జెండా మోసినోళ్లు ఎక్కడ...!

- -అధికార పార్టీలోనూ ధిక్కార స్వరం
- -ఫిరాయింపులతో పార్టీని నమ్ముకున్నోళ్లకు దక్కని ప్రాధాన్యత
- -దశాబ్దాలుగా పని చేసిన దక్కని గుర్తింపు
- -పార్టీ ఏదైనా పైసా పలుకుబడికే పట్టం
- -వేదన చెందుతున్న కార్యకర్తలు

**సూర్య, కామారెడ్డి**

చీమలు పెట్టిన పుట్టలు పాములకు ఇరువు అయినట్లు అన్న చందంగా ప్రస్తుత రాజకీయాలు మారిపోయాయి. దశాబ్దాలుగా జెండా మోసినోళ్లను కాదని... ఫిరాయింపు దారులకు ప్రాధాత ఇస్తున్నారని కార్యకర్తలు వేదనకు గురవుతున్నారు. ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన ఫిరాయింపు దారులే ముందు వరుసలోకి వచ్చి అవకాశాలను గద్దల్లా తన్నుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పార్టీలో చూసిన నిబద్ధత గల్ల కార్యకర్త... చతికిలపడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రస్తుత రాజకీయాలన్నీ కరెన్సీ కాగితాలకే మొగ్గు చూపుతున్నాయని ఆవేదన ఆందోళనకు గురవుతున్నారు. ఇంటింటికి తిరిగి పూటకు కూడు తినకుండా చెమటోడ్చినా కార్యకర్త ఇప్పుడు అసహ్యంగా కన్పిస్తూ... కరెన్సీ కాగితాలు, సూటు బూటు, సంపన్నులు ఆత్మీయులవుతున్నారని ఆరోపణలు జిల్లాలో జోరుగా నడుస్తున్నాయి. తమ నాయకుడు గెలుపొందాలని శ్రమించిన క్షేత్ర స్థాయి కార్యకర్తకు గుర్తింపు కాదు కదా పలకరించే వారే లేరని మదనపడుతున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇటువంటి సంఘటనలు ఆయా నియోజకవర్గాలలో పునరావృతం అవుతున్నాయి. అధికార పార్టీ నుంచి మొదలుకొని వివిద ప్రతిపక్ష పార్టీలలో కూడా తమను పట్టించునే వారు కరువయ్యారని వాపోతున్నారు. ప్రధానంగా ప్రస్తుతం కామారెడ్డి జిల్లాలో అధికార పార్టీలోనూ దిక్కార స్వరాలు పెరుగుతున్నాయి. కష్టం మాదైతే ప్రతిఫలం మరొకరికి అంటూ కాంగ్రెస్ శ్రేణులే తిరగబడుతున్న అయోమయ పరిస్థితి నెలకొంది. కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు ఉండగా కామారెడ్డి లో బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, ఎల్లారెడ్డి లో కాంగ్రెస్ నుంచి మదన్ మోహన్ రావు, బాన్సువాడ లో బీఆర్ఎస్ నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి, జుక్కల్ నియోజకవర్గం నుంచి తోట లక్ష్మి కాంతారావు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. కాగా కాంగ్రెస్ అధికార పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంతో బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందిన పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ లో చేరారు. దీంతో ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కూడా ఇచ్చింది. రాష్ట్ర వ్యవసాయ సలహాదారుగా నియమించింది. అయితే పోచారం శ్రీనివాస్ రెడ్డి మీద కాంగ్రెస్ అభ్యర్థిగా ఏనుగు రవీందర్ రెడ్డి పోటీ చేశారు. పోచారం కాంగ్రెస్ లో చేరిన తరువాత ఒక్కసారిగా కాంగ్రెస్ లో వర్గ పోరు భగ్గుమంది. ఇక్కడ రెండు గ్రూపులుగా కాంగ్రెస్ విడిపోయింది. కాగా పోచారంకు వ్యతిరేకంగా రవీందర్ రెడ్డి వర్గం




వెళ్లి ఆయా మంత్రులను, పార్టీ పెద్దలను కలిసి అనేక ఫిర్యాదులు చేసింది. అయినా రేవంత్ రెడ్డి పెద్దగా పట్టించుకోకపోవడం అదే సమయంలో పోచారంకు రాజకీయ పదోన్నతి రావడంతో కాంగ్రెస్ కోసం కష్టపడ్డ తమ పరిస్థితి ఏమిటని శ్రేణులు ఆందోళనలో పడ్డారు. ఇదిలా ఉంటే మొదటి నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి కి ప్రధాన అనుచరునిగా ఉన్న కాసుల బాల్ రాజు పోచారం మీదనే గతంలో కాంగ్రెస్ అభ్యర్థి గా పోటీ చేశారు. అయితే మొన్నటి సార్వత్రిక ఎన్నికలలో తనకే సీటు కేటాయించాలని పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. ఎటువంటి ప్రాణాపాయం జరగకుండా బయటపడ్డారు. తరువాత అధిష్టానం బుజ్జగింపులతో ఏనుగు రవీందర్ రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థి గా (మిగతా 2లో)

# జెండా మోసినోళ్లు ఎక్కడ...!

**(మొదటి పేజీ తరువాయి)**

అగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. అప్పటి వరకు రవీందర్ రెడ్డి పక్కన నిలబడ్డ ఆయన పోచారం చేరికతో కాసుల బాల్ రాజు తిరిగి గురవు దగ్గరకు చేరారు అనే గుసగుసలు నడుస్తున్నాయి. ఇదిలా ఉంటే ఏనుగు రవీందర్ రెడ్డి సుదీర్ఘమైన కాలం ఎల్లారెడ్డి నియోజకవర్గం ఆయన వెంట నిలబడింది. 2018లో జరిగిన ఎన్నికలలో అప్పటి టీఆర్ఎస్ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సురేందర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. ఆ తరువాత కొన్ని రోజులకు బీజేపీలో ఈటల రాజేందర్ తో కలిసి చేరారు. తానే బీజేపీ ఎల్లారెడ్డి అభ్యర్థిగా అని చెప్పుకుంటూ వచ్చి చివరికి ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని వదిలి హస్తం పార్టీలో చేరి బాన్సువాడకు వెళ్లిపోయారు.

– ఎల్లారెడ్డి నియోజకవర్గం లో కాంగ్రెస్ అభ్యర్థిగా 2018లో గెలిచిన సురేందర్ బీఆర్ఎస్ లో చేరారు. కాగా 2019లో జరిగిన స్థానిక ఎంపీటీసి, జడ్పీటీసీ ఎన్నికల్లో ఉద్యమ పార్టీ వారిని కాకుండా.. తన వెంట కాంగ్రెస్ నుంచి వచ్చిన వారికే టీఆర్ఎస్ టికెట్లు ఇచ్చుకున్నాడనే ఆరోపణలు వచ్చాయి. అయినా మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ రావు చేతిలో ఓటమి చవిచూడక తప్పలేదు. అయితే ఎల్లారెడ్డి లోనూ కాంగ్రెస్ లో మొదటి నుంచి ఆధిపత్య పోరు నడుస్తూ వచ్చింది. చివరకు మదన్ మోహన్ రావుకు టికెట్ రావడంతో అప్పటి వరకు కాంగ్రెస్ పార్టీలో రేవంత్ రెడ్డి కి అత్యంత సన్నిహితునిగా ఉన్న సుభాష్ రెడ్డి బీజేపీ లో చేరి ఎమ్మెల్యే గా పోటీ చేశారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన కొన్ని రోజులకు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. కాగా ఈ మద్య ఎల్లారెడ్డి లో తిరిగి సుబాష్ రెడ్డి వర్గంగా కాంగ్రెస్ లో ఓ గ్రూఒఉత తయారైంది. దీంతో బహిరంగంగానే అధికార పార్టీ ఎమ్మెల్యే మీద కాంగ్రెస్ శ్రేణులు దిక్కార స్వరం పెంచుతూ వస్తున్నారు. మరో పక్క కాంగ్రెస్ కోసం కష్టకాలంలో నిలబడ్డ శ్రేణులకు ఈ గ్రూపు రాజకీయాలు పెద్ద గండంగా మారిపోయాయి. తమకు సముచిత స్థానం కల్పించాలని ఎమ్మెల్యే ముందు ఉంచినా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి నామినేటేడ్ పదవుల్లో అన్యాయం జరుగుతూ వస్తుందని ద్వితీయ శ్రేణి నాయకత్వం భావిస్తుంది.

– జుక్కల్ నియోజకవర్గంలోనూ అధికార పార్టీలో అసమ్మతి పెల్లుబికిలింది. ఏకంగా తోట లక్ష్మి కాంతారావుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తూ వస్తున్నారని ఫిరాయింపు దారులకే ప్రాధాన్యం ఇస్తున్నాడని ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా పని చేసిన తమను కాదని వేరే వారికి పదవులు అప్పజెప్పుతున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల కాలం పార్టీ కోసం కష్టపడ్డ తమను కాకుండా కరెన్సీ కాగితాలు, సూటు బూటు ఉన్న వారికే ప్రాధాన్యం దక్కడం లేదని వాపోతున్నారు. ఇదిలా ఉంటే కామారెడ్డి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే గా గెలిచారు. ఆయన ఎమ్మెల్యే గా గెలవక ముందు చేసిన ప్రజా ఆందోళనల నుంచి ఎన్నికల వరకు తాము తీవ్రంగా కష్టపడ్డామని అయినా ఇప్పుడు తమను గుర్తించే పరిస్థితి లేదని కొందరు మదనపడుతున్నారు. అయితే బీజేపీలో ప్రస్తుతం గ్రూపు రాజకీయాలు లేకుండా ఉన్నప్పటికీ కార్యకర్తల్లోనూ కొంత అసంతృప్తి కన్పిస్తుంది. అయితే ఎమ్మెల్యే రమణారెడ్డి మాత్రం ఈ సారి ఎలాగైనా మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో పాటు స్థానిక సంస్థల్లో సత్తా చాటాలని కార్యకర్తలను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. లోలోపల వ్యూహంతో బీజేపీ అడుగులు వేస్తూ క్షేత్ర స్థాయిలో దృష్టి సారించడంతోనే రమణారెడ్డి ప్రస్తుతం దూకుడు ప్రదర్శించడం లేదని కార్యకర్తల్లో చర్చ మొదలైంది.

– కామారెడ్డి జిల్లా కేంద్రం అయినా కామారెడ్డి నియోజకవర్గంలో షబ్బీర్ అలీకి కాంగ్రెస్ లో పెట్టింది పేరు. రాజకీయ జీవితాన్ని ఇచ్చినా కాంగ్రెస్ పార్టీని ఆయన ఎన్నడూ విడవలేదు. మొన్నటి ఎన్నికల్లోనూ కామారెడ్డి నుంచి కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయడం వల్ల ఆయనకు ఇక్కడ పోటీ చేసే అవకాశం దక్కలేదు. రేవంత్ రెడ్డి ని కాంగ్రెస్ అధిష్టానం కామారెడ్డి లో పోటీ చేయించాలనే నిర్ణయంతో షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్ లో అధిష్టానం సూచనతో పోటీ చేసి ఓటమి చెందారు. అయినప్పటికీ ఆయన పార్టీ పట్ల ఉన్న విదేయతకు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. అప్పటి నుంచి ఆయన కామారెడ్డి తో పాటు అటు నిజామాబాద్ అర్బన్ లోనూ కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. అయితే కామారెడ్డి లోనూ మొన్నటి వరకూ బీఆర్ఎస్ లో ఉన్న కొందరు మళ్లీ కాంగ్రెస్ లో మొదటి వరుసలో నిలబడడానికి పార్టీలో చేరారు. కొన్ని సంవత్సరాలుగా పార్టీలో ఉంటున్న తమకు కాకుండా మళ్లీ ఎక్కడ ఈ ఫిరాయింపుదారులు తమ అవకాశాలు కొట్టేసుకొని పోతారోననే మొదటి నుంచి గత పదేళ్లు గా కాంగ్రెస్ లో ఉన్న కార్యకర్తలు మదనపడుతున్నారు. అటు ఉద్యమ పార్టీగా చెప్పుకునే బీఆర్ఎస్ సైతం పూర్తిగా ఆనాడు ఉద్యమకారులను మరిచి ఫిరాయింపుదారులకే పట్టం కట్టిందని ఇప్పుడు వారంతా తిరిగి వెళ్లిపోయారని చెబుతున్నా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ శ్రేణుల కోసం కృషి చేయడానికి మాజీ ఎమ్మెల్యే లు అంటిముట్టనట్లుగానే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం అవుతుంది. అయితే అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్య టఫ్ ఫైట్ నడుస్తూ వస్తుంది. స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని కాంగ్రెస్ చూస్తోంది. ఈ గ్రూపు రాజకీయాల వల్ల కాంగ్రెస్ నష్టపోయే అవకాశాలు ఒకవైపు అయితే మరో పక్క ఫిరాయింపుల వల్ల పరిస్థితి ఎట్లా మారుతుందో తెలవని పరిస్థితి నెలకొంది. కాగా బీఆర్ఎస్ రాష్ట్ర స్థాయిలో జరిగే అంశాలపై తప్పా క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో శ్రద్ద చూపకపోవడంతో నిఖార్సయినా గులాబీ శ్రేణులు అయోమయంలో పడుతున్నారు. దశాబ్దలుగా పార్టీలను నమ్ముకున్న కార్యకర్తల కష్టాన్ని ఫిరాయింపుదారులు రాబందుల్లా తన్నుకుపోతున్నారని జెండా మోసిన కార్యకర్తలు తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. జెండా మోసినోళ్లను అన్ని పార్టీలు మురిపిస్తు వస్తున్నాయే తప్పా గుర్తింపు ఇవ్వడం లేదని కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా రాజకీయ చర్చ జోరుగా మొదలైంది. ఏది ఏమైన నాయకుని మీదనో, పార్టీ మీదనో అభిమానంతో పని చేసిన కార్యకర్త, భుజాలు కందిపోయేలా పనిచేసి కండువా మార్చకుండా పని చేసినోళ్లను గుర్తించే స్థాయిలో ఏ పార్టీ లేదు. రాజకీయ పార్టీల కోణం అంతా కావాల్సింది గుంపు తప్పా... గుండెల నిండా అభిమానం నిబద్దత కలిగినోళ్లు కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని చర్చించుకుంటున్నారు.

# పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా కృషి చేయాలి

**- వార్షిక తనిఖీల్లో భాగంగా బాన్సువాడ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సింధు శర్మ.**

**సూర్య, కామారెడ్డి జిల్లా ప్రతినిధి**

ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని జిల్లా ఎస్పీ సింధు శర్మ ఐపిఎస్ సూచించారు. వార్షిక తనిఖీ లో భాగంగా శనివారం బాన్సువాడ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ., ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని, బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చుని అన్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టాయని, అసాంఘిక కార్యకలాపాలు ఏవైనా ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ లో ఉన్న కేసుల గురించి, పెండింగ్ ఉన్న కేసులపై రివ్యూ చేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసుల నమోదు, శాంతి భద్రతల



పరిరక్షణకు సంబంధించిన వివరాలని అడిగి తెలుసుకున్నారు. రిసిప్షనిస్ట్ ప్రతి దరఖాస్తు పై తప్పనిసరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో జనరేట్ చేసినా రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. అనంతరం సిబ్బంది తో మాట్లాడుతూ., పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా గా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టి కి తీసుకొని రావాలి అని సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు పలు సూచనలు చేసారు. పోలీసు స్టేషన్ లో అన్ని రకాల విధులను సక్రమంగా నేర్చుకోవాలన్నారు. రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసెప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, సమన్లు మొదలుగు విధులను సీనియర్ల ద్వారా తెలుసుకోవాలన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ డిఎస్పి సత్యనారాయణ, బాన్సువాడ ఎస్ హెచ్ ఓ ఎం. అశోక్, ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని వర్గాల వారు ఆధారిస్తున్న ఏకైక పత్రిక నేటి దిన పత్రిక "సూర్య"

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రజలకు ఎప్పటికప్పుడు వార్తలను సూర్య పత్రిక ద్వారా అందిస్తున్నందుకు సూర్య పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. సామాన్యులకు సైతం "నేటి దిన పత్రిక సూర్య" ద్వారా వార్తలు అందుతుండడం, విభిన్న కొత్త కోణాల్లోకి సూర్య పత్రిక కూడా తీసుకుపోవడం అభినందించదగ్గ విషయమని, సూర్య పత్రిక 19వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా సూర్యపత్రిక యాజమాన్యానికి, అందులో పని చేస్తున్న పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ భీమ్ కుమార్, కామారెడ్డి బ్యూరో గాండ్ల సుభాష్, స్టాఫ్ రిపోర్టర్ సుధీర్ కుమార్, కామారెడ్డి ఆర్. సి ఇన్చార్జ్ నక్క సిద్ధిరాములు, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ వెంకట్ ఆకుల, జిల్లాలో ఆయా మండలాల్లో పనిచేస్తున్న పాత్రికేయులు, పంబల శ్రీనివాస్, సాయిలు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతంగా నిర్వహించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

వచ్చే వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. గత సంవత్సరంలోని అనుభవాలను దృష్టిలో ఉంచుకొని త్రాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, ఏమైనా లీకేజి ఉంటే ముందుగా శరచేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటిపన్ను వసూళ్లు చేయాలని వచ్చే జనవరి లోగా 100 శాతం పన్నులు వసూళ్లు చేయాలని తెలిపారు. సి.సి.చార్జీలు, ట్రాక్టర్ నెలవారీ బ్యాంకు కిస్తీలు చెల్లించాలని అన్నారు. ఇంటింటి చెత్త సేకరణ ద్వారా కంపోస్టు ఎరువును తయారు చేయాలని, అట్టి ఎరువును అవసరం మేరకు వినియోగించుకొని , మిగతాది విక్రయించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు, లే అవుట్ అనుమతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇవ్వాలని, 45 దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అన్నారు. వణమహోత్సవం కార్యక్రమం క్రింద బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తిచేసి, విత్తనాలు నాటాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరికీ పనులు కల్పించాలని, లేబర్ మొబైలైజేషన్ చేయాలని అన్నారు. వంద రోజుల పనిదినాలు కల్పించాలని తెలిపారు. మహిళా శక్తి కార్యక్రమం క్రింద బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి క్రింద ఋణాలు మంజూరు చేయడం, తీసుకున్న రుణాలను వసూళ్లు చేయాలని తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనం లను పరిశీలించి మొక్కల ఎదుగుదలకు వాటరింగ్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ సీఈవో చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, మిషన్ భగీరథ, గృహ నిర్మాణం, ఎంపిడిఒ లు, ఎంపీఒ లు, గ్రామీణాభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు - త్వరలో ప్రభుత్వం శుభవార్త చెబుతుంది

**- సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు సంఘీభావం..తెలిపిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**

**సూర్య, కామారెడ్డి**

సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని కరీంనగర్ –అదిలాబాద్ –నిజామాబాద్ –మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు ..శనివారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు గత కొన్ని రోజులు గా తమ డిమాండ్లు పరిష్కరించాలని చేపట్టిన సమ్మెకు అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి సంఘీభావం తెలిపి మాట్లాడారు... ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు రేవంత్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని.. ఎవరు ఆందోళన పడొద్దని ..ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టు కుంటుందని , ఉద్యోగులందరికి న్యాయం జరిగే విధంగావారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.... మీ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తుందని... ఏ ఒక్కరు అధైర్య పడద్దని త్వరలోనే ప్రభుత్వ మీకు శుభవార్త చెబుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



సూర్య
www.suryaa.com
ఆదివారం 29 డిసెంబర్ 2024

# సమన్వయంతో ఇంటర్ విద్య బోధన జరగాలి

## - ప్రతిష్టాత్మకంగా 90 రోజుల ప్రణాళిక - ఇంటర్ విద్యా ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

**సూర్య నిజామాబాద్ ప్రతినిది**



ఇంటర్ విద్యలో ప్రతిష్టవంతమైన ప్రణాళికతో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు వెళ్లేందుకు ఇంటర్ బోర్డు 90 రోజుల ప్రణాళికను తీసుకొచ్చిందని నిజామాబాద్ జిల్లాకు ఇంటర్ బోర్డు నియమించిన రాష్ట్ర ప్రత్యేక అధికారి శ్రీ ఒడ్డెన్న (హైదరాబాద్ జిల్లా ఇంటర్ విద్య అధికారి, స్పెషల్ ఆఫీసర్) అన్నారు. నిజామాబాద్ జిల్లాలో శనివారం పలు కళాశాలలను తనిఖీ చేసి ఆయన సమీక్షించారు. ఉదయంనిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, మధ్యాహ్నం డిచ్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీ ఒడ్డెన్న తనిఖీ చేసి సమీక్షించారు. నిజామాబాద్ ఇంటర్ విద్య అధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్ తోపాటు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ శ్రీ బుద్ధిరాజ్, శ్రీ చంద్ర విట్టల్ ఆయా కళాశాలల అధ్యాపకులు ఈ సమీక్ష సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు తమ వ్యక్తిగత ఫలితాలను మాత్రమే ఇప్పటివరకు చూసుకుంటున్నారని, దీనివల్ల గ్రూపు ఉత్తీర్ణత శాతం, కళాశాల ఉత్తీర్ణత శాతం తగ్గుతోందని, ఇక ముందు తమ గ్రూపులకు సంబంధించిన ఇతర సబ్జెక్టుల అధ్యాపకులతో విద్య బోధనలో సమన్వయం చేసుకుంటూ ప్రతి విద్యార్థి పై వ్యక్తిగత శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఆయా గ్రూపులలో నిర్దేశించిన మేరకు విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గితే ఇంటర్ బోర్డు అధ్యాపకుల పై చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అధ్యాపకుల బోధన తీరుతో పాటు, కళాశాలకు హాజరవుతున్న విద్యార్థులకు ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షల మార్కుల వివరాల నమోదు, వచ్చే మార్చి నెలలో నిర్వహించే వార్షిక పరీక్షలలో సాధించాల్సిన వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఆయన దిశా, నిర్దేశం చేశారు. ఇక పై అధ్యాపకులు సమన్వయంతో ముందుకు వెళ్ళనట్లయితే ఇంటర్ బోర్డు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు. ఇంటర్ బోర్డు కమిషనర్ శ్రీ కృష్ణ ఆదిత్య పర్యవేక్షణలో ప్రత్యేక అధికారులను నియమించి చదువులో వెనుకబడిన, కళాశాలకు రెగ్యులర్గా రాని విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు వారి నీ అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులుగా తయారు చేసేందుకు 90 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారనీ శ్రీ ఒడ్డేన్న అన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుల పనితీరును ఆయన సమీక్షించి, అంచనా వేశారు. కళాశాలకు రాని విద్యార్థులను కచ్చితంగా రప్పించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు, సలహాలు చేశారు. పరీక్షలకు విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయడంతో పాటు వారి భవిష్యత్తు అధ్యాపకుల చేతిలో ఉందని గమనించాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలకు వస్తున్న పేద, మధ్య తరగతి, వెనకబడిన తరగతుల కులాల, మైనారిటీ వర్గాల విద్యార్థులను జాగరుకుతతో గమనిస్తూ, వారి స్థితిగతులను, పరిస్థితులను అంచనా వేస్తూ సబ్జెక్టులను బోధించెందుకు శ్రద్ధ వహించాలనీ ఆదేశించారు. చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి ఉదయం, సాయంత్రం ప్రతి అధ్యాపకుడు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. ఈ విషయంపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్లు ఖచ్చితంగా వ్యవహరించాలన్నారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి శ్రీ తిరుమలపుడి రవికుమార్ మాట్లాడుతూ ఇదివరకే 90 రోజుల ప్రణాళికపై అన్ని కళాశాల అధ్యాపకులతో ప్రిన్సిపాల్లతో సమావేశాలు నిర్వహించమని, అయినప్పటికీ పరిస్థితులలో మార్పులు రాకపోతే ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తానని హెచ్చరించారు. వచ్చే ప్రయోగ పరీక్షలను, వార్షిక పరీక్షలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధ్యాపకులు విద్య బోధనపై శ్రద్ధ వహించాలని అన్నారు. వచ్చే ప్రీ ఫైనల్ పరీక్షల నాటికి ప్రతి విద్యార్థికి తాము ఉత్తీర్ణులవుతామన్న భరోసాను కల్పించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్లతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.




# ప్రభుత్వానికి పట్టభద్రులకు మధ్య వారధిగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## - పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు

**సూర్య నిజామాబాద్ ప్రతినిధి**



పట్టభద్రుల తరఫున ప్రశ్నించే గొంతుకనవుతానని ప్రభుత్వానికి పట్టభద్రులకు మధ్య వారధిగా ఉండి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన క్రమబద్ధీకరణ హామీని నిలబెట్టుకోవాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు రెగ్యులరైజేషన్ చేయాలని నిజామాబాద్ ధర్నా చౌక్ లొ 22 రోజులుగా నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు తన సంపూర్ణ మద్దతును ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు ప్రకటించినారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ సంరక్షణ చట్టం కొరకు 2018 లోనే కేంద్రంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సంరక్షణ చట్టానికి ప్రయివేట్ బిల్



పెట్టించమని ఈ బిల్లుకు సపోర్ట్ చేసేవారు లేక అడుగున పడి పోయింది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యా సుంకం పేరుతో లక్షల కోట్లు కూడా పెట్టి విద్య వ్యవస్థకు ఖర్చు పెట్టకుండా దానిని వేరే పద్దు కు మారుస్తున్నారని అన్నారు. పట్టభద్రుల సమస్యలను అడిగి తెలుసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదల కాక చాలా కళాశాలలు మూతపడ్డాయని ఫీజు రియంబర్స్మెంట్ విడుదలకు కృషి చేస్తానని అన్నారు. 22 సంవత్సరాలుగా ప్రజాసేవ ప్రజా సమస్యల కొరకు పనిచేస్తున్నానని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల ద్వారా ఎంతోమంది ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న వారికి సంరక్షణ చట్టం లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ 272 మండలాలను తిరిగి అక్కడి సమస్యలను తెలుసుకున్నానని అన్నారు. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్సూరెన్స్ మరి హెల్త్ కార్డులాకై కృషి చేస్తానని అన్నారు. పట్టభద్రుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి అభివృద్ధి ధ్యేయంగా మీ ముందుకు వస్తున్నానని ఎమ్మెల్సీగా కాదు మీకు సేవ చేసే సేవకుడిగా వస్తున్నాను అని అన్నారు. పట్టభద్రుల సేవే మార్గం అభివృద్ధి దేంగా వస్తున్నానని అన్నారు. కనీస వేతన చట్టం అమలకు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయాల బలోపేతం చేస్తాను. ఈ కార్యక్రమంలో ట్రస్మా స్టేట్ స్పోక్స్ పర్సన్ జయసింహా గౌడ్, ట్రస్మా స్టేట్ అడ్వైజర్ మామిడాల మోహన్, జిల్లా ప్రెసిడెంట్ నిత్యానందం, ట్రస్మా నిజామాబాద్ అర్బన్ అధ్యక్షులు ధర్మరాజు, ట్రస్మా నిజాంబాద్ అర్బన్ సెక్రటరీ శ్రీనివాస్, నిజామాబాద్ అర్బన్ వైస్ ప్రెసిడెంట్ నారా గౌడ్, నిజాంబాద్ అర్బన్ జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రస్మాబాధ్యులు కే నాగరాజు, గడ్డం రమేష్, సిహెచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ పటిష్టత కోసమే బూత్ అధ్యక్షుల నియామకం

**సూర్య- బిక్కనూర్**

భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు బూత్ అధ్యక్షులను నియమించడం జరుగుతుందని, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి చెప్పారు. శనివారం మండలంలోని కాచాపూర్ గ్రామ బూత్ అధ్యక్షులుగా అంజరెడ్డి, పరశురాములు, శివరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బూత్ అధ్యక్షులుగా నియమించిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం తమ వంతు కృషి



చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు, మండల బిజెపి అధ్యక్షుడు ఉప్పరి రమేష్, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిగారి రమేష్ రెడ్డి పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధిరామేశ్వర్ నగర్‌లో ఓ ఇంట్లో దొంగతనం

**సూర్య- బిక్కనూర్**



మండలంలోని సిద్ధ రామేశ్వర్ నగర్ గ్రామంలో బాబు మీయా ఇంట్లో గురువారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఇంటి తాళాలు పగల కొట్టి దొంగతనానికి పాల్పడ్డట్లు, దొంగతనం జరిగిన రోజున ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శుక్రవారం రాత్రి వచ్చి చూసేసరికి ఇంట్లో దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఏఎస్ఐ జగదీష్ శనివారం ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఘటన స్థలం వద్ద క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జగదీష్ తెలిపారు.

# సోమవారం మాధవరావు సంతాప సమావేశం

**సూర్య నిజాంబాద్ రూరల్**



నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది, మానవహక్కుల నేత గొర్రెపాటి మాధవరావు అకాల మృతికి సంతాప సూచకంగా సోమవారం ఉదయం పదిన్నరకు జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హల్‌లో సంతాప సభ ఏర్పాటు చేసినట్లు బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని ఎల్లమ్మగుట్టలో గల గొర్రెపాటి నివాసంలో మాధవరావు పార్థివశరీరానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుదీర్ఘ న్యాయవాద వృత్తిలో జీవించి, ప్రజా సంఘాలలో, మానవ హక్కుల వేదికలలో ప్రజల జీవిన విధానంలో సమాజిక, ఆర్థిక, రాజకీయ మార్పులకు శ్రమించిన ప్రజల మనిషి మాధవరావు అని జగన్ కొనియాడారు. జిల్లా కోర్టు హల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో జిల్లా జ్యూడిషియరి తరపున నివాళులు అర్పించిన అనంతరం బార్ సమావేశపు హల్‌లో శ్రద్ధాంజలి ఘటించనున్నట్లు జగన్ తెలిపారు.

# ఎంపీడీవో కార్యాలయంలో నాగుపాము కలకలం

**సూర్య రెంజల్**



మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నాగుపాము కలకలం సృష్టించింది. శనివారం కార్యాలయంలో ఉదయం నాగుపాము బాత్రూం గదిలో కనిపించడంతో సిబ్బంది భయభ్రాంతులకు గుర య్యారు. కార్యాలయ ఆవరణలో నుండి లోనికి వచ్చిందని స్థానికంగా పనిచేసే స్వీపర్ తెలిపారు. సుమారు రెండు మూడు గంటల పాటు నాగుపాము కదలకుండా భయభ్రాంతులకు గురిచేస్తూ కలకలం సృష్టించిందని తెలిపారు. అనంతరం స్థానిక వ్యక్తితో పామును పట్టుకొని బయటకు వదిలినట్లు అధికారులు తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**సూర్య రెంజల్**



ప్రభుత్వం అందిస్తున్నటువంటి మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్ అన్నారు. శనివారం రెంజల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్నటువంటి భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్నటువంటి మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న సమయంలో అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అందిస్తున్న సరుకుల వివరాల రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట సూపర్డెంట్ శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు విద్యార్థిని ఉన్నారు.

# ల్యాబ్‌ను ప్రారంభించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు

**సూర్య ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన నిజ్జన మహేందర్ శనివారం బాన్సువాడ పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన పాతలోజికల్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈరోజుల్లో ప్రతి ఒక్కరు ఆరోగ్యం గురించి ముందు జాగ్రత్తలు ల్యాబ్ టెక్నీషియన్లతో అన్ని రకాల ఆరోగ్య సేవలను పరీక్షించుకుని డాక్టర్ సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ల్యాబ్ టెక్నీషియన్ల పరిస్థితులు అఘమ్య గోచరంగా ఉన్న సందర్భంలో కూడా అందరికి సేవ చేయాలనే దృక్పథంతో పాథలజికల్ ల్యాబ్ ఏర్పాటు చేయడం చాలా ఆనందకరమని ఆయన అన్నారు.